అల్లీనగర్ ఎఫ్ఎస్‌వో సస్పెన్షన్

జన్నారం(దండేపల్లి), అక్టోబర్ 24: జన్నారం రేంజ్ పరిధిలోని అల్లీనగర్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి కిరణ్మయి జ్యోతి విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో సస్పెన్షన్ వేటు పడింది. ఈనెల 9న అల్లీనగర్ గ్రామానికి చెందిన ఆత్రం నగేశ్ ఇంట్లో ముందస్తు సమాచారం మేరకు రూ.54వేల అక్రమ కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ కలపను పట్టుకున్న వ్యవహారంలో సెక్షన్ అధికారిపై పలు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి రమాదేవిని ఆదేశించారు.ఆ నివేదిక ఆధారంగా సెక్షన్ అధికారి సస్పెండ్ చేసినట్లు డీఎఫ్‌వో, స్థానిక ఇన్‌చార్జి ఎఫ్‌డీవో శివ ఆశిష్ సింగ్ తెలిపారు.

గూడెంలో ప్రత్యేక పూజలు

దండేపల్లి, అక్టోబర్24: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామిని పూజ్యశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి నైమిశారణ్య పీఠాధిపతులు గురువారం దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఆధ్వర్యంలో సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు శేషవస్త్రం బహూకరించి, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు నారాయణ శర్మ, ముఖ్య అర్చకులు రఘుస్వామి, సంపత్‌స్వామి, అర్చకులు పాల్గొన్నారు.

సింగరేణి కేటాయించిన స్థలాలకు మారాలి

జైపూర్, అక్టోబర్ 24: జైపూర్ మండలంలోని గుత్తేదారుపల్లి (శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు నిర్వాసితులు) 17 కుటుంబాలు సింగరేణి కేటాయించిన స్థలాలకు వెళ్లాలని జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డి సూచించారు. ఆర్‌కే5లో నిర్వాసితులకు సింగరేణి కంపెనీ క్వార్టర్స్ కేటాయించినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఓసీ విస్తరణలో 11 సంవత్సరాల క్రితమే 17 కుటుంబాలవారికి పరిహారం అందగా గ్రామాన్ని ఇప్పటివరకు ఖాళీ చేయలేదని పేర్కొన్నారు. ఓపెన్‌కాస్టు గని గ్రామానికి అతి సమీపంలోకి వచ్చినందున ప్రమాదం పొంచి ఉందని వెంటనే వెళ్లిపోవాలని సూచించారు.

మహిళా ఉద్యోగులకు అవగాహన

మందమర్రి, అక్టోబర్ 24: సింగరేణి మందమర్రి ఏరియాలోని గనులు, విభాగాల్లో జనరల్ మజ్దూర్, బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కేటాయించనున్న 16 డిజిగ్నేషన్లపై అవగాహన కల్పించారు. మందమర్రి సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయంతోపాటు బెల్లంపల్లి శాంతిఖని గని కార్యాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో అధికారులు మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డాక్టర్ జయవాణి, డీవైపీఎం సత్యబోస్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాయలింగు తదితరులున్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబర్ 24 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ 1గనిలో పనిచేస్తూ 2024 వార్షిక సంవత్సరం సెప్టెంబర్ వరకు 70 మస్టర్ల కన్నా తక్కువ పనిచేసిన గైర్హాజరు కార్మికులకు గురువారం గనిపై మేనేజర్ విజయ్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ పీవో సాధన్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, సహాయ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

జనరల్ మజ్దూర్ ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబర్ 24 : శ్రీరాంపూర్ ఏరియాలో జనరల్ మజ్దూర్ ఖాళీల భర్తీకి రెండోరోజూ గురువారం జీఎం ఆఫీస్‌లో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న 139 మందిలో 99 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో డీవైజీఎం అరవిందరావు, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, డాక్టర్ సమీర సందాని, ఐఈడీ డీవైజీఎం చిరంజీవులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ఆసిఫాబాద్ టౌన్,అక్టోబర్ 24: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా పాల్పడితే కట్టిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్ నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, రవాణా, పంచాయతీరాజ్, మైనింగ్, భూగర్భ జల శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మైనింగ్ సహాయ సంచాలకులు గంగాధర్, డివిజనల్ పంచాయతీ అధికారి ఓమర్ హుస్సేన్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జన్నారం(దండేపల్లి), అక్టోబర్24: జన్నారం మండలంలోని పైడిపెల్లి హనుమాన్ గుడి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, చింతలపల్లికి చెందిన కట్టకుంట్ల రాజన్న (50), ముల్కల్ల రవీందర్ ఇద్దరు కలిసి లక్షెట్టిపేట నుంచి జన్నారం వైపు వస్తుండగా హనుమాన్ గుడివద్ద ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడి రాజన్న అక్కడిక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు 108లో లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 24: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంచుకోవాలని 108 రాష్ట్ర ప్రధాన కార్యాలయ అంబులెన్స్ వాహనాల అధికారులు గజేందర్, లింగాచారి అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతా శిశు దవాఖానలో మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల 108 అంబులెన్స్ వాహనాల పైలెట్, ఈఎంటీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉత్తమ సేవలను అందించిన కోటపల్లి ఈఎంటీ శహబాజ్, లక్షెట్టిపేట, దండేపల్లి పైలెట్లు గంగన్న, గోపిలకు 108 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల, కుమ్రం భీం జిల్లాల 108 కార్యనిర్వహణ అధికారులు సంపత్, సతీశ్, ఈఎంటీ, పైలెట్లు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ ప్రతినిధులపై కేసు

కాగజ్‌నగర్, అక్టోబర్ 24: కాగజ్‌నగర్ లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మహేందర్ గురువారం తెలిపారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు లారీలను అడ్డుకొని, భయాభ్రాంతులకు గురిచేసినట్లు మెదక్ జిల్లాకు చెందిన డ్రైవర్లు రాజు, సత్తయ్య బుధవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోడల్ లైబ్రరీ సద్వినియోగం చేసుకోండి

రెబ్బెన, అక్టోబర్ 24: మోడల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని రెబ్బెన ఎంఈవో వెంకటేశ్వర్ అన్నారు. రెబ్బెన మండలంలోని వంకులం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ మోడల్ లైబ్రరీని ఎంఈవో వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఇక్కడ హెచ్ఎం ప్రభాకర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు విజయారాణి, మహేశ్వర్, పురుషోత్తం, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు వినయ్‌కుమార్, లతీఫ్, ఉప్పులేటి శ్రీనివాస్, సీఆర్పీలు తదితరులున్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

కాగజ్‌నగర్, అక్టోబర్ 24: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణ సీఐగా రాజేంద్ర ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాగజ్‌నగర్ పట్టణ సీఐ శంకరయ్య బదిలీపై వెళ్లడంతో రామగుండంలో విధులు నిర్వర్తించిన రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. సీఐ రాజేంద్రప్రసాద్‌కు బదిలీపై వెళ్లిన సీఐ శంకరయ్య, పట్టణ ఎస్ఐలు దీకొండ రమేశ్, సుధాకర్ స్వాగతం పలికారు.

బాలుర క్రికెట్ పోటీలు

నస్పూర్, అక్టోబర్ 24 : మంచిర్యాలలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-19 బాలుర క్రికెట్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ డీఐఈవో అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాబురావు, ఫణిరాజా, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీడీలు రాజయ్య, సుదీప్, పీఈటీలున్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

దండేపల్లి(జన్నారం), అక్టోబర్ 25: జన్నారం మండలంలోని వివిధ గ్రామాల్లో నాటుసారా, గుడుంబా తయారు చేసి, అమ్మిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నర్సింహులు తెలిపారు. పుట్టకొక్కుల నరేశ్, బానావత్ లక్ష్మి, కామెర మల్లు, లావుడ్యా సంతోష్, డొంగరి విజయలక్ష్మి, గంధం లక్ష్మి, గోల్లె అమృతను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయ దారికి మరమ్మతులు

దండేపల్లి, అక్టోబర్ 25: ఈనెల 28న దర్బార్ నేపథ్యంలో దండేపల్లి మండలంలోని పద్మల్‌పురి కాకో ఆలయానికి ఆలయానికి వెళ్లే రోడ్డులో నాయకులు మొరం పోయించి చదును చేయించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక్కడ జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి, చిట్ల రమణ, బండ రాకేశ్, బత్తుల రమేశ్, సిరికొండ నవీన్, ఆదివాసీ నాయకులు మర్సుకొల్ల సంతోష్, భీంరావు, కిరణ్, అశోక్, తదితరులున్నారు.

పాముకాటుతో యువకుడి మృతి

బెజ్జూర్, అక్టోబర్ 24 : సోమినికి చెందిన యువకుడు జంగం జీవన్ దాస్(22) పాటు కాటుతో మృతి చెందినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపాడు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, జీవన్‌దాస్ బుధవారం పంట చేలోకి వెళ్లినపుడు పాముకాటు వేసింది. కుటుంబ సభ్యులు నాటు వైద్యం చేయించగా, రాత్రి వరకు కూడా నయం కాలేదు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు జీవన్ దాస్‌ను మహారాష్ట్ర అహేరి దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం దవాఖానలో చనిపోయాడు. కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగ విరమణ జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, అక్టోబర్ 24 : శ్రీరాంపూర్ జీఎంగా సేవలందిస్తూ ఉద్యోగ విరమణ పొందనున్న సంజీవరెడ్డిని గురువారం ఎస్సార్పీ-3 గనిపై టీబీజీకేఎస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, గని ఇన్‌చార్జి సాదుల భాస్కర్ జీఎం సంజీవరెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఇక్కడ నాయకులు ఉత్తేజ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

నేడు కార్మికులకు దీపవళి బోనస్

శ్రీరాంపూర్, అక్టోబర్ 24 : సింగరేణి కార్మికులకు ఈనెల 25న దీపావళి బోనస్(పీఎల్ఆర్) బోనస్ చెల్లిస్తారని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య పేర్కొన్నారు. 93,750 రూపాయల బోనస్‌ను కార్మికుల వేతనాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఏఐటీయూసీ కోరిన మేరకు కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు.

ముగ్గురి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 24: మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న సీసీసీ నస్పూర్‌కు చెందిన ముగ్గురు తనుగుల నారాయణ, పులి తిరుపతి, మందమర్రికి చెందిన తీగల శంకర్‌ను అరెస్ట్ చేసినట్లు శ్రీరాంపూర్ మహిళ పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ విషయంలో సిబ్బందిని సీఐ అభినందించారు.

నాటుసారా పట్టివేత

సిర్పూర్(టీ), అక్టోబర్ 24 : మండలంలోని జక్కాపూర్‌లో గురువారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ అధికారులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, దుర్గే చందర్, దుర్గే యశ్వంత్, కామ్లే శ్రీనులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. దాడుల్లో సిబ్బంది వీరస్వామి, నవీన్, సాయికిరణ్ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- అడిషనల్ ఎస్పీ, ఆర్ ప్రభాకర్‌రావు(అడ్మిన్)
- జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

ఆసిఫాబాద్ టౌన్: రక్తదానం చేస్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అంజన్న

ఆసిఫాబాద్ టౌన్,అక్టోబర్ 24: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్ లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర రావు (అడ్మిన్) ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసులతోపాటు యువకులు మొత్తం 51 యూనిట్లు రక్తదానం చేసినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం మహాదానమని, రక్తదానం చేసిన పోలీసులు, యువకులను అభినందించి పండ్లు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐలు, ఎస్ఐలు, ప్రభుత్వ దవాఖాన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 24 : చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 150 మందికి పైగా రక్తదానం చేయగా, వారికి జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ ప్రశంసా పత్రాలను అందించారు. సబ్ డివిజన్‌లోని జైపూర్, చెన్నూర్‌లో శిబిరం నిర్వహించినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి (జన్నారం), అక్టోబర్ 25: జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్లో ఫిర్యాదు, డయల్ 100, ఫింగర్ ప్రింట్ స్కానర్ గురించి వివరించారు. ఇక్కడ ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

కౌటాల, అక్టోబర్ 24 : పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మధూకర్ పోలీస్ సేవలపై అవగాహన కల్పించారు. పోలీసుల సేవలు, పోలీసులు ఉపయోగించే ఆయధాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వివరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ బాల కిషన్‌రావు, అధ్యాపకులు, పోలీసులున్నారు.

పెంచికల్ పేట్, అక్టోబర్24 మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అమరవీరుల సంస్కరణ సందర్భంగా ఎస్ఐ కొమురయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులున్నారు.

రైసుమిల్లుల యాజమాన్యాలపై కన్నెర్ర

- నిబంధనలు పాటించని రెండు రైసుమిల్లులను సీజ్ చేసిన పౌరసరఫరాల అధికారులు
- పెంచిన గడువు లోపల బియ్యం డెలివరీ చేయాలని ఆదేశాలు

మంచిర్యాల (ఏసీసీ), అక్టోబర్ 24: జిల్లాలో కొన్ని రైసుమిల్లర్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా పౌరసరఫరాశాఖ, టాస్క్‌ఫోర్సు జరిపిన దాడుల్లో జిల్లాలోని రెండు రైసుమిల్లులపై ఎఫ్ఐఆర్ నమోదు కావడం కలకలం రేపింది. జిల్లా వ్యాప్తంగా జరిపిన దాడుల్లో బెల్లంపల్లి మండలంలోని మాతేశ్వరి రైస్‌మిల్లు, హాజీపూర్ మండలంలోని దుర్గా రైస్‌మిల్లులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలడంతో పంచనామా నిర్వహించిన అధికారులు అనంతరం పోలీసు స్టేషన్లో కేసు ఫిర్యాదు చేశారు. ఆర్ఆర్ యాక్టు కింద క్రిమినల్ కేసునమోదైనట్లు జిల్లా పౌర సరఫరా శాఖ మేనేజర్ శ్రీకళ తెలిపారు. ప్రస్తు తం బెల్లంపల్లి సీఐ విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

భారీ తేడా..

2023-24 ఖరీఫ్‌కు సంబంధించి మాతేశ్వరి రైసు మిల్లు, 2023-24 రబీకి సంబంధించి దుర్గా రైసుమిల్లు నిబంధలను అనుగుణంగా ధాన్యాన్ని అప్పగించలేదని పౌర సరఫరా అధికారులు తెలిపారు. మాతేశ్వరి రైసు మిల్లు బియ్యాన్ని డెలివరీ చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. నిజానికి బియ్యం సరఫరా గడువు గతనెల 30 వరకే ముగియగా, తాజాగా ఈనెల 31వరకు పొడిగించారు. అయితే మాతేశ్వరి మిల్లు సుమారుగా 2,581 టన్నుల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా, కేవలం 377 టన్నుల ధాన్యాన్ని మాత్రమే సరఫరా చేసింది. దాదాపు 2,200 టన్నులకుపైగా లోటు నమోదైంది. అంటే కేవలం 15 శాతం మాత్రమే లక్ష్యం సాధించింది. నిజానికి ఏ దశలోనూ లక్ష్యాన్ని సాధించేలా ఈ మిల్లు కనిపించడం లేదని ఇప్పటికే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఫిర్యాదులు రావడంతో టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేయడంతో, మిల్లు యాజమాన్యం చేతులెత్తేసింది. సాధారణంగా తనిఖీల్లో 50-60 శాతానికి లక్ష్యాన్ని సాధించినట్లయితే మిల్లు యాజమాన్యానికి మరో అవకాశం ఇస్తారు. అయితే ఈ రైసుమిల్లు ప్రదర్శన మరీ తీసికట్టుగా ఉండటంతో, అధికారులు కేసు నమోదు చేశారు. జిల్లాలోని మిగతా రైసుమిల్లుల్లోనూ క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తామని అధికారులు వెల్లడించారు.

నిబంధనలు పాటించని రైస్‌మిల్లులపై దాడులు

రెగ్యులర్‌గా నిబంధనలు పాటించని రైస్‌మిల్లులపై దాడులు చేస్తున్నాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఆర్ఆర్ యాక్టు ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. ధాన్యం సేకరణ గడువు గతనెల 30తో ముగిసినప్పటికీ ఈనెల 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ అవకాశాన్ని రైసుమిల్లుల యాజామాన్యాలు సద్వినియోగం చేసుకోవాలి.

-శ్రీకళ, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్

అసత్య ఆరోపణలు సరికాదు

- మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కాంతయ్య

లక్షెట్టిపేట, అక్టోబర్ 24: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావుతోపాటు ఆయన కొడుకు విజిత్‌రావుపై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య అన్నారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఎలాంటి అవినీతికి పాల్పడని వ్యక్తి మన మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అని అన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆరోపణల్లో నిజం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మున్సిపాలిటీలో నాలుగు సంవత్సరాలుగా చేసిన అభివృద్ధిని ప్రతి ఒక్కరూ చూసారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులంతా బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే వెన్నంటే ఉంటూ ఆయనను పొడిగిన వాళ్లేనన్నారు. ఎలాంటి అవినీతి ఉన్న ప్రజా కోర్టులో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణం ఎవరో ఏదో చెప్పారని ఇలా మాట్లాడడం సరికాదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని, తన తల్లిదండ్రుల పేరిట ట్రస్టు పెట్టి సేవ చేస్తున్నానే తప్ప వేరే ఆశించలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, నాయకులు పెట్టెం తిరుపతి, చాంద్‌పాషా, అన్వర్, షాబొద్దీన్, ఇంతియాజ్, గోల్కొండ సత్తయ్య, శంకర్‌రావు, కాంతయ్య, సురేందర్‌రెడ్డి, సొల్లు సురేశ్, శేఖర్, జిన్ని వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆదివాసీ భవన్‌లో కుమ్రం భీం వర్ధంతి

కెరమెరి, అక్టోబర్ 24: మండలంలోని ఆదివాసీ భవన్‌లో కుమ్రం భీం 84వ వర్ధంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. అనంతరం భీం విగ్రహానికి ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీలు సెడ్మాకి దుర్పతాబాయి, ఆత్రం లక్ష్మణ్‌రావ్ ఆదివాసీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కోవ విజయ్ కుమార్, కనక ప్రభాకర్, కోవ ఇందిరా, మడవి రఘునాథ్, పెందోర్ ఆనంద్‌రావ్, సిడాం జగన్నాథ్‌రావ్, రాయిసిడాం జంగు, కుమ్రం అంబారావ్, కుడ్మెత సోము, ఆత్రం రాము, కుసుంరావ్, భీంరావ్, పెందోర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

- ఒకరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా

కాగజ్‌నగర్, అక్టోబర్ 24: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని మారుతీ నగర్‌కు చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 20 వేలు జరిమానా, విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు కాగజ్ నగర్ పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కాగజ్ నగర్ పట్టణంలో మారుతీనగర్‌లో ఉండే ఒక మహిళను ఇంట్లో అద్దెకు ఉంటున్న అశోక్ పెళ్లి చేసుకుంటానని చెప్పి సహజీవనం చేశాడు. తీరా పెళ్లి చేసుకోనడంతో సదరు మహిళ కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్లో 21.12.2019న ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై అప్పటి మొదటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ డి మోహన్ కేసు నమోదు చేసి నిందితుడు అశోక్‌ని రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రామ్ సింగ్ ఏఎస్ఐ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ బాబాజీ కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్ మోహన్‌రావు వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎంవి రమేశ్ నేరం రుజువు కావడంతో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధించినట్లు కాగజ్ నగర్ టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పైకేసులో నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పీపీ జగన్ మోహన్‌రావు, డీఎస్పీ రామానుజం, సీఐ, ఎస్ఐ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్ ఏఎస్ఐ, కోర్టు డ్యూటీ ఆఫీసర్ బాబాజీలను ఎస్పీ అభినందించారు.

కాలబైరవ స్వామికి ప్రత్యేక పూజలు


కాలభైరవ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన, అక్టోబర్ 24: రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గదేవి స్వయంభూ మహంకాళి దేవస్థానం సముదాయంలో గల కాల భైరవ స్వామికి గురువారం భైరవాష్టమి పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాల భైరవ స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్ స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్ : ప్రాథమిక కేంద్ర వైద్యురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, అక్టోబర్ 24 : ప్రభుత్వ దవాఖానకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం హాజీపూర్ మండలంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్లను, పరిసరాలు, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని తెలిపారు. సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి హాజరు పట్టికలు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించారు. వేంపల్లి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ముల్కల్ల పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశాంచారు. కలెక్టర్ వెంట మండల పరిషత్ అధికారి ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఆయా పంచాయతీల కార్యదర్శులున్నారు.

విద్యార్థులపై మాదక ద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలి

నస్పూర్, అక్టోబరు 24 : పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల భవిష్యత్‌పై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టర్ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై డీసీపీ భాస్కర్, ఆర్డీవో హరికృష్ణ, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు రవికుమార్, వెంకటేశ్వర్, జిల్లా అబ్కారీ మద్యనిషేధ అధికారి నందగోపాల్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల ఉత్ప త్తి, రవాణా నిరోధించేందుకు అన్ని శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. సమావేశంలో డీసీపీ, డీఈవో యాదయ్య, డీఎంహెచ్‌వో హరీస్‌రాజ్, వ్యవసాయాధికారి కల్పన, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణ లో చేపట్టిన సెంట్రల్ డ్రగ్ స్టోర్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భవనాన్ని ఆకస్మికంగా సందర్శించి కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు.

ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి

జిల్లాలో ప్రత్యామ్నాయ, వాణిజ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఉద్యానవన అధికారి అనితతో కలిసి సమావేశం నిర్వహించారు. రైతులు సాగు చేసే వరి, పత్తితో పాటు వాణిజ్య, ఉద్యానవన, కూరగాయల పంటలు సాగు చేసి అధిక దిగుబడి పొందాలన్నారు. ఇక్కడ సంబంధిత అధికారులున్నారు.

ఈఎస్ఐ దవాఖాన మందులు మెడికల్ షాపులో విక్రయం

- విచారణ చేపట్టిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని

కాగజ్‌నగర్, అక్టోబర్ 24: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని ఈఎస్ఐ దవాఖానలో విధులు నిర్వర్తించే ఫార్మసిస్టు కరీంనగర్‌లోని ఓ మెడికల్ షాపులో మందులు విక్రయిస్తుండగా కరీంనగర్ ఔషధ నియంత్రణ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. ఈ విషయమై గురువారం కాగజ్‌నగర్ ఈఎస్ఐ దవాఖానలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని సోదాలు నిర్వహించారు. మందుల నిల్వలు, వినియోగం వివరాలు సేకరించినట్లు ఈఎస్ఐ దవాఖాన సూపరింటెండెంట్ జగన్ తెలిపారు. గతంలో సైతం కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ దవాఖాన మందులు స్థానిక మెడికల్ షాపుల్లో విక్రయించినట్లు తెలుస్తున్నది. అంతే కాకుండా ఈఎస్ఐ దవాఖానకు సంబంధించిన కాలం చెల్లిన మందులు దవాఖాన సమీపంలోనే నిప్పుపెట్టడం కూడా జరిగింది. ఈఎస్ఐ దవాఖానపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లక్షల రూపాయలు వేతనం పొందుతున్నా వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని, దూర పట్టణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారని ఆరోపణన్నాయి. ఈఎస్ఐ దవాఖాన పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 12 వేల మంది ఈఎస్ఐ కార్డు హోల్డర్లున్నారు.

కాంగ్రెస్ సర్కారు గద్దె దిగాలి

బెజ్జూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జూర్, అక్టోబర్ 24 : ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం బెజ్జూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో బీఆర్ఎస్ నాయకుడు కొండ రాంప్రసాద్ ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని హామీలిచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఎస్ఐ విక్రం అక్కడికి చేరుకొని వారిని సమూదాయించి ఆందోళన విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సూర్ల ఇస్తారి, కాజా మైనుద్దీన్ పాల్గొన్నారు.

యువతి, ప్రియుడి అరెస్టు

మందమర్రి, అక్టోబర్ 24 : యువకులను మాయమాటలతో నమ్మించి డబ్బులు రాబడుతున్న యువతితోపాటు ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మందమర్రి పోలీస్ స్టేషన్‌లోని సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. మందమర్రికి చెందిన బొద్దిరెడ్డి మౌనికకు.. జమ్మికుంటకు చెందిన ఓ వ్యక్తితో కొన్ని రోజుల క్రితం వివాహం జరిగింది. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాదిన్నరగా మందమర్రిలోని తన తల్లి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో యాపల్ ఏరియాకు చెందిన ప్రైవేట్ ఉద్యోగితో ఫోన్ ద్వారా పరిచయం చేసుకుంది. కొన్ని రోజులకు తన కొడుకు దవాఖానలో ఉన్నాడని, డబ్బులు కావాలని అతడిని అడిగింది. దీంతో ఫోన్‌పే ద్వారా రూ.4,600 పంపించాడు. కొన్ని రోజుల పాటు చనువుగా ఉంటూ వచ్చింది. ఆ తర్వాత సదరు యువకుడు తన డబ్బులు ఇవ్వమని గట్టిగా అడిగినందుకు ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసింది. అనంతరం యువతి ప్రియుడు మధూకర్ మరోసారి ఆ యువతికి ఫోన్‌చేస్తే పోలీసులకు పట్టించి కేసులు పెట్టిస్తానని సదరు యువకుడిని బెదిరించాడు. కేసు పెట్టకుండా ఉండాలంటే మళ్లీ డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. దీంతో భయపడిన యువకుడు పలు దఫాలుగా రూ. 85 వేలు ఫోన్‌పే చేశాడు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయగా, తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, మౌనిక-మధూకర్ ప్రస్తుతం గుంటూరు జిల్లా పొన్నూరులో సహజీవనం చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ జంట చాలామందిని మాయమాటలు చెప్పి మోసం చేసినట్లు తెలిసిందన్నారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐతోపాటు హెడ్‌కానిస్టేబుళ్లు అజయ్, రాము, మహిళా హోంగార్డు ఉమను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అభినందించారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌కు చెన్నూర్ నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్, అక్టోబర్ 24: ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన రైతు రణరంగం కార్యక్రమానికి బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సూచన మేరకు చెన్నూర్ నుంచి పలువురు బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. చెన్నూర్ మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపాలిటీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్‌తోపాటు పలువురు నాయకులు తరలివెళ్లారు.

కోటపల్లి, అక్టోబర్ 24 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తలపెట్టిన నిరసన సభకు కోటపల్లి మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. కోటపల్లి పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మారిశెట్టి తిరుపతి, సోషల్ మీడియా అధ్యక్షులు ఆసంపల్లి సంపత్, నాయకులు ఆసంపల్లి అనిల్, అరుణ్ తరలివెళ్లారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

మందమర్రి, అక్టోబర్ 24: నేరాలను నియంత్రించడానికే కమ్యూనిటీ కంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి అన్నారు. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫిల్టర్ బెడ్ కాలనీలో గురువారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. తగిన ధ్రువీకరణ పత్రాలు లేని 38 వాహనాలను సీజ్ చేశారు. బెల్ట్ షాపుల్లో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శశీధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యతని, కాలనీలో కొత్త వ్యక్తుల సమాచారం ఉంటే అందించాలని కోరారు. ఇక్కడ మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ మల్లేశ్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

మహిళా టైలరింగ్ యూనియన్ నూతన కార్యవర్గం


టైలరింగ్ యూనియన్ నూతన కమిటీ సభ్యులు

తాండూ ర్, అక్టోబర్ 24 : మండలంలోని కిష్టంపేట, తం గళ్లపల్లి, తాం డూర్, ఐబీకి చెందిన టైలరింగ్ మహిళలందరూ కలిసి గురువారం శ్రీలక్ష్మి మహిళా టైలరింగ్ యూనియన్‌ను ఏర్పాటు చేసుకొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అన్నం శ్వేత, ఉపాధ్యక్షురాలిగా తాళ్లపల్లి రాజ్యలక్ష్మి, జనరల్ సెక్రటరీగా చల్ల రాధ, సభ్యులుగా కొండు నాగమణి, సయ్యద్ ఫాతిమాతోపాటు మిగతా మహిళలందరినీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కమిటీ సభ్యులందరూ ఐకమత్యంతో కలిసి ఉండాలని కోరారు. నూతనంగా ఏర్పాటైన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.